సాక్షి బాపట్ల

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



దుర్గమ్మకు వెండి దీపకుందులు


విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ మ్మకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు మంగళవారం వెండి దీప కుందులను కానుకగా సమర్పించారు.



కేడీసీసీబీకి నాఫ్స్కాబ్ అవార్డు

విజయవాడ : ఉత్తమ జిల్లా సహకార కేంద్ర బ్యాంకుగా కేడీసీసీబీ నాఫ్స్కాబ్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్స్ కో ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్) అవార్డుకు ఎంపికైంది.

కూరగాయల అలంకరణలో గణపయ్య



పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలో వాసవి యూత్ ఆధ్వర్యంలో 25వ శ్రీ విజయ గణపతి స్వామి నవరాత్రి ఉత్స వాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళ వారం స్వామిని వివిధ రకాల కూరగా యలు, ఆకుకూరలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి పవిత్రోత్స వాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పవి త్రోత్సవాలలో భాగంగా మూడో రోజు మంగ ళవారం తెల్లవారుజామున నాలుగు గంట లకు మూలవరులకు స్నపన, అగ్నిహోమం, స్వామి వార్లకు పవిత్ర సమర్పణ, హోమాలు, అష్టారీతి, పారమాత్మిక హోమాలు, పరివార దేవతలకు పవిత్ర సమర్పణ, ప్రసాదగోష్టి జరిగాయి. సాయంత్రం నిత్యహోమం, పంచసూక్త హోమం, మహాశాంతి హోమాలు నిర్వహించారు భక్తులు స్వామిని దర్శిం చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్స వాలను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

28 నుంచి నరసరావుపేట ఎల్‌సీ గేటు మూత

లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు రైల్వే డివి జన్ పరిధిలోని నరసరావుపేటలో డబ్లింగ్ పనుల వల్ల ఈనెల 28 నుంచి అక్టోబర్ 1 వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నట్లు రైల్వే శాఖ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. సాతులూరు–నరస రావుపేట–మనుమాక మధ్య డబ్లింగ్ పనుల జరుగుతున్న నేపథ్యంలో గేటును మూసివేస్తు న్నట్టు వివరించారు. వాహనదారులు గమనించాలని కోరారు.

జాబ్‌మేళా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వేమూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 29న జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. దీనికి సంబం ధించి వాల్‌పోస్టర్లను మంగళవారం ఆయన గుంటూరులోని తన స్వగృహంలో ఆవిష్కరిం చారు. జాబ్ మేళాకు 20 కంపెనీలు తరలివ స్తాయని, 950 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఆస్కారం ఉందని జిల్లా నైపుణ్యాభి వృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు చెప్పారు. జీతం వారి విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ. 30 వేల వరకు ఉంటుందని వివ రించారు. నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్య క్రమంలో రవికుమార్, బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏడు మండలాల్లో వర్షం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో అక్కడక్కడా మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఏడు మండలాల్లో వర్షం పడింది. పొన్నూరు మండలంలో 16.4 మిల్లీమీటర్లు, పెదకాకాని 7, గుంటూరు పశ్చిమ 5.2, గుం టూరు తూర్పు 5, వట్టిచెరుకూరు 3.2, తాడే పల్లి 1.8, ప్రత్తిపాడు మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 26వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 121.8 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 187.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులూ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.4,000, గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,000 వరకు పలికింది.

ప్రతిభా పరిశోధనం

- సైన్స్ ట్యాలెంట్ సెర్చ్
- విద్యార్థి విజ్ఞాన్ మంథన్‌కు దరఖాస్తుల ఆహ్వానం
- 6 నుంచి 11వ తరగతి విద్యార్థులకు పరీక్ష
- ఎంపికైతే స్కాలర్‌షిప్‌తోపాటు, ప్రఖ్యాత పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం
- దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు

బాపట్ల అర్బన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచి సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యార్థులు పరిశోధన, ప్రయోగాల్లో రాణించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పేరుతో జాతీయస్థాయిలో ప్రతిభా అన్వే షణ పరీక్షను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఈ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీ(నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) విజ్ఞాన ప్రసాద్, విజ్ఞాన భారతి సంయుక్తకంగా నిర్వహిస్తు న్నాయి. దేశంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీ డియెట్ ఫస్టియర్ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. పరీక్షలో ప్రతిభ కనబ రిచిన వారికి స్కాలర్‌షిప్పులతోపాటు ప్రముఖ పరి శోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం లభిస్తుంది.

సెప్టెంబర్ 30 వరకు గడువు

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మే 21 నుంచి ఆన్ లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 30న గడువు ముగుస్తుంది. పరీక్ష ముందు ఆన్‌లైన్ పద్ధ తిలో పాఠశాల స్థాయిలో జరుగుతుంది. విద్యార్థులు అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్, ల్యాప్ టాప్, డెస్క్ టాప్ డిజిటల్ పరికరాలలో ఏదైనా ఒకదాని ద్వారా పరీక్ష రాయొచ్చు. దీనికోసం నిర్దేశిం చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.

జూనియర్, సీనియర్ విభాగాల్లో...

పోటీ పరీక్షను జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహిస్తారు. 6–8 తరగతులను జూనియర్, 9–11 తరగతులను సీనియర్ విభాగాలుగా విభజించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ తదితర భారతీయ భాషల్లో పరీక్ష రాయొచ్చు.



విద్యార్థి విజ్ఞాన్ మందన్ లోగో

100 మార్కులకు పరీక్ష

నమూనా పరీక్ష అక్టోబర్ 18న నిర్వహిస్తారు. ప్రధాన పరీక్ష అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉంటుంది. ఈ రెండురోజుల్లో ఏదో ఒక రోజు పరీక్ష రాసే వెసులుబాటు ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య 90 నిమిషాలపాటు పరీక్ష రాయాలి. ప్రతి విద్యార్థి ఒకసారి మాత్రమే యాప్‌లో లాగిన్ అవ్వగలుగుతారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారిలా..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభ చూపిన మొదటి 20 మందిని ఎంపిక చేస్తారు. 6–11 తరగతులకు మొత్తం 120 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26 లేదా డిసెంబర్ 3,10,17 తేదీల్లో ఏదో ఒక రోజు రాయాలి. రాష్ట్రస్థా యిలో ప్రతి తరగతి నుంచి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు వరుసగా 5,000, 3,000, 2,000తోపాటు మెమెంటో సర్టిఫికెట్ అందజేస్తారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి మెమెంటో, ప్రశంసా పత్రం అందజేస్తారు.

జాతీయస్థాయికి ఇలా..

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రతి తరగతి నుంచి మొదటి ఇద్దరు విద్యార్థుల వంతున 12 మం దిని ప్రతి రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. అందులో ప్రతి తరగతిలో ప్రతిభ చూపిన మొదటి ముగ్గురు వంతున 18 మందిని జాతీయ స్థాయి విజేతలుగా ప్రకటిస్తారు. జాతీయస్థాయి విజేత లకు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులుగా వరు సగా 25 వేలు, 15 వేలు, 10 వేలతోపాటు మెమెంటో ప్రశంసాపత్రం అందజేస్తారు. విద్యార్థి విజ్ఞాన్ మంథ న్–2023–24లో జాతీయ స్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఆర్‌డీఓ, ఇస్రో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ మొదలైన ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరి శోధన సంస్థల్లో 1–3 వారాలపాటు ప్రత్యేక శిక్షణ, ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తారు.

పరీక్ష పేపర్ ఇలా..

పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ వంద మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–ఏలో విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయ మేధావుల కృషిపై 20 ప్రశ్నలు, బీర్బల్ సహాని జీవిత చరిత్ర నుంచి 20 ప్రశ్నలు, సెక్షన్–బీలో జూనియర్ సీనియర్ విద్యార్థులకు గణితం ఫిజిక్స్ కెమిస్ట్రీ బయాలజీ సబ్జెక్టు నుంచి 50 ప్రశ్నలు, లాజిక్ రీజనింగ్‌పై పది ప్రశ్నలు ఉంటాయి.

విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో ఈ పరీక్షల్లో పాల్గొనేలా హెచ్‌ఎంలు కృషి చేయాలి విద్యార్థుల్లో సైన్స్‌పై జిజ్ఞాస పెంచి పరీక్షపై అవగాహన పెంచాలి. రోజూ గంట పాటు శిక్షణ ఇవ్వాలి.

– వి.ఎస్.సుబ్బారావు, ఆర్జేడీ పాఠశాల విద్యాశాఖ బాపట్ల జిల్లా

వ్యక్తిగతంగా లేదా పాఠశాల నుంచి



పరీక్ష రాయడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా పాఠశాలల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీవీఎం.ఓఆర్‌ఎఫ్‌ఐ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

– పి.వి.జె.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి బాపట్ల

ప్రణాళిక ప్రకారం పక్కా గృహాల నిర్మాణం చేపట్టాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: పక్కా గృహాల నిర్మాణం ప్రణాళిక లేకుం డా చేస్తే పురోగతి ఎలా సాధ్యమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ప్రశ్నించారు. గృహ నిర్మాణాలు, భూముల రీ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల నిర్వహణపై డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం అధికారులు పనిచేయాలని సూచించారు. పని తీరు మార్చుకోవాలని హెచ్చరిం చారు. భట్టిప్రోలు మండలంలో 42 లేఅవుట్లలో 2,900 గృహాలు లక్ష్యం కాగా కేవలం 450 గృహాలు నిర్మించడం ఏమిటని నిలదీశారు. చీరాల పట్టణం లో 2,300 గృహాలకు కేవలం 480 పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలిన మండలాల్లోనూ పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చీరాల డివిజన్లో 12 శాతం రేపల్లె డివిజన్లో ఏడు శాతం మాత్రమే పురోగతి ఉండడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 256 ఇంకుడు గుంతలు మాత్రమే పూర్తి కాగా 1,310 ఇంకుడు గుంతలు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు.

గడప గడపకు మన ప్రభుత్వం పనులు వేగవంతం చేయాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని కలె క్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ రెండో విడత ద్వారా 22 గ్రామాలలో హద్దు రాళ్ల ఏర్పాటు గడువు దాటినా లక్ష్యాలను చేరుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో మూడో విడత రీ సర్వే కార్యక్రమానికి 73 గ్రామా లను ఎంపిక చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30 నుంచి లాంఛనంగా ప్రారం భించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బాపట్లలో సాగు చేస్తున్న పంటలకు ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జేసీ సి.హెచ్.శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 46 శాతం ఈ–కేవైసీ పూర్తయిందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

జగనన్న గోరుముద్దకు వంట పాత్రలు

- సరికొత్త స్టీల్ పాత్రల పంపిణీ
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరఫరా

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్ద ఆర గిస్తున్న విద్యార్థులకు మరింత శుచి, శుభ్రతతో ఆహార పదార్థాలను అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలకు సరికొత్త వంట పాత్రలను సర్కారు సరఫరా చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్టెయిన్ లెస్ స్టీల్‌తో తయారు చేసిన వంట పాత్రలు జిల్లాలోని పాఠశాలలకు చేరాయి. విద్యార్థుల అభిరుచి మేరకు ఎప్పటికప్పుడు సరికొత్త మెనూ ప్రకారం బలవర్ధక మైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ప్రభుత్వం వంట చేసేందుకు వినియోగించే పాత్రలనూ ఎండీఎం ఏజె న్సీలకు ఉచితంగా పంపిణీ చేస్తోంది. కొత్తగా పంపిన వంట పాత్రలపై జగనన్న గోరుముద్ద లోగోను ముద్రించింది. వాటిని ఇతర కార్యక్రమాలకు విని యోగించకుండా చర్యలు చేపట్టింది. విద్యార్థుల సం ఖ్యకు అనుగుణంగా పాఠశాలలను ఏ,బీ,సీ,డీ కేటగిరీ లుగా విభజించి, వేర్వేరు సైజుల్లో పాత్రలను పంపిణీ చేసింది. గతంలో అల్యూమినియం పాత్రలు ఉండేవి. ఇప్పుడు స్టీల్ పాత్రలను సరఫరా చేసింది. గుంటూరు జిల్లాలోని 1,070 పాఠశాలల్లో 764 పాఠశాలలకు వంట పాత్రలు వచ్చాయి. జిల్లాలో మొత్తం 1,04,000 మంది విద్యార్థులు ఉండగా, 85 వేలమందికిపైగా విద్యార్థులు రోజూ జగనన్న గోరుముద్దను ఆరగిస్తున్నారు.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- చెరువులో మునిగి ముగ్గురు మృత్యువాత
- అందరూ వలస కార్మికులే
- గణపవరం గ్రామంలో దుర్ఘటన

నాదెండ్ల: వినాయకుని విగ్రహం నిమజ్జనం చేసేం దుకు చెరువులోకి దిగిన ముగ్గురు మృత్యువాత పడిన ఘటన గణపవరం గ్రామంలో సోమవారం జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చి కూలిపని చేసుకుని జీవిస్తున్న మూడు కుటుంబాల్లో విషాదం నెలకొంది. పోలీ సుల కథనం ప్రకారం.. గణపవరంలోని ఓ స్పిన్నిం గ్ మిల్లులో బేల్‌దారీ కార్మికుడిగా మహారాష్ట్రకు చెం దిన ముఖేష్‌మోతిరామ్ ఖోటే (39) పనిచేస్తుం టాడు. ప్రకాశం జిల్లా మార్కాపురం గ్రామానికి చెం దిన భాగ్యం ప్రవీణ్ (18), శ్రీకాకుళం జిల్లా ఆము దాలవలస మండలం బొమ్మిడివానిపేటకు చెందిన కోన వసంతకుమార్ (18) తల్లిదండ్రులు కంపెనీ క్వార్టర్లలో నివాసం ఉంటూ అక్కడే కూలీలుగా పని చేస్తుంటారు. ప్రవీణ్, వసంత్‌కుమార్ ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నారు. వినాయక చవితి సంద ర్భంగా ముఖేష్ ఇంట్లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు సోమవారం ముఖేష్, ప్రవీణ్, వసంత్ వేలూరు రోడ్డులోని ప్రభువు చెరువుకు సాయంత్రం 6 గంటలకు వెళ్లారు. 9 గం టలైనా ముగ్గురూ తిరిగి రాకపోయేసరికి ప్రవీణ్, వసంత్ తల్లిదండ్రులు ఆందోళనకు గురై చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ వారి చెప్పులు, బైక్, సైకిల్, సెల్‌ఫోన్లు కనిపించాయి. దీంతో పోలీసులకు సమా చారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో గాలించగా రాత్రి 11 గంటల సమయంలో భాగ్యం ప్రవీణ్ మృతదేహం లభిం చింది. అర్ధరాత్రి ఒంటి గంట వరకూ వెతికినా మిగిలిన వారి జాడ కానరాక పోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఉదయాన్నే మళ్లీ గాలింపు చేపట్టగా ముఖేష్ మోతిరామ్‌ఖోటే మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయం లో కోన వసంతకుమార్ మృతదేహం లభ్యమైంది. ముగ్గురి మృతదేహాలను చిలకలూరిపేట ప్రభుత్వా స్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రూరల్ ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.



చెరువు వద్ద గాలింపు చర్యలను పరిశీలిస్తున్న కుటుంబ సభ్యులు, స్థానికులు



కోన వసంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి రామారావు

అడుగు విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లి..

వినాయక చవితి సందర్భంగా ముఖేష్ నివాసంలో అడుగు ఎత్తు గల వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసి సోమవారం వరకూ పూజలు జరిపారు. మహా రాష్ట్రలో నివాసం ఉండే తల్లి మృతి చెందిందని కబురు రావటంతో పూజలు నిలిపివేసి వినా యకుని నిమజ్జనం చేసేందుకు క్వార్టర్లలో ఉండే ప్రవీణ్, వసంత్ సహాయం కోరాడు ముఖేష్. తాను సైకిల్‌పై, ప్రవీణ్, వసంతకుమార్ ఇద్దరూ బైక్‌పై విగ్రహాన్ని తీసుకుని చెరువు వద్దకు వెళ్లారు. ముగ్గురూ ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ చెరువు వద్దకు వెళ్లి అందులో మునిగినట్టు గుర్తించారు.

అనాథలుగా ముగ్గురు చిన్నారులు



ముఖేష్‌మోతిరామ్ ఖోటే ముగ్గురు పిల్లలతో ఏడాది క్రితం గణపవరం వచ్చి స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ క్వార్టర్లలో ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈయన భార్య రెండేళ్ల క్రితం వదిలి వెళ్లిపోయింది. ఇద్దరు చిన్నారులు గ్రామం లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. మూడో చిన్నారి రెండేళ్ల పాప కావటంతో ముఖేష్ అల్లారుముద్దుగా పెంచుతున్నాడు. తండ్రి మృతితో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు.

ఐటీఐ పాసై ఉద్యోగ వేటలో ఉండగా..



శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలస మండలం దమ్మిడివానిపేట గ్రామానికి చెందిన కోన రామారావు పదేళ్లుగా స్థానిక కంపెనీ క్వార్టర్లలో ఉం టూ పనులకు కావలసిన కూలీలను సరఫరా చేసే మేస్త్రీగా వ్యవహరి స్తున్నాడు. ఈయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు వసంత్‌కుమార్ చిలకలూరిపేటలోని ఏఎంజీలో ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఉద్యోగ వేటలో ఉన్నాడు. అతను ఇప్పుడు మరణించడంతో రామారావుతోపాటు ఆయన భార్య గుండెలవిసేలా రోదిస్తున్నారు.

సాయంగా వెళ్లి..



ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన భాగ్యం పుల్లయ్య, విజయమ్మ దంప తులు నాలుగేళ్లుగా కంపెనీ క్వార్టర్లలో నివాసం ఉంటూ పనులకు వెళ్తున్నారు. స్వస్థ లంలో ఎలాంటి పనులు లేకపోవటంతో నాలు గేళ్ళ క్రితం వలస కార్మికులుగా వచ్చి పనిచేసు కుంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కాగా, పెద్దకుమారుడు ఉద్యోగం చేస్తున్నాడు. ప్రవీణ్ చదువు పూర్తి చేసి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ప్రవీణ్ ముఖేష్‌కు సాయంగా వెళ్లి మృతి చెంద డంతో పుల్లయ్య, విజయమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం



దొడ్డ సువార్త



బిల్లా ప్రభావతి

మేడికొండూరు: మందపాడు గ్రామంలో మంగళ వారం పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం పాలయ్యారు. గ్రామానికి చెందిన దొడ్డ సువార్త (45), బిల్లా ప్రభావతి (22) గ్రామంలోని మిరప మొక్కలు నాటేందుకు వెళ్లారు. పని చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దం తో పిడుగుపడడంతో ఘటనా స్థలంలోనే మహి ళలు మృతిచెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుం బ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ బాధిత కుటుంబా లను పరామర్శించి, వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం అందజేశారు. మేడికొం డూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చీరాలలో ‘జగనన్నకు చెబుదాం’

బాపట్ల: జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్ర మాలను బుధవారం చీరాలలో నిర్వహించను న్నట్టు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జగ నన్నకు చెబుదాంతోపాటు ప్రత్యేక స్పందన కార్య క్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు చీరాల ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్ ఓపెన్ ఎయిర్ ఆడి టోయంలో జరుగుతుందని వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం

- నాణ్యమైన వైద్యం అందించాలన్నదే లక్ష్యం
- రాజుబంగారుపాలెంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు
- జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్

చినగంజాం: ప్రతి ఇంటికీ నాణ్యమైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. మంగళవారం మండలంలోని రాజుబం గారుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఈ సందర్భం గా జేసీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రక్త, షుగర్, కంటి తదితర ఏడు రకాల పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొ న్నారు. అనుభవం కలిగిన వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైతే చికిత్స అందిస్తారని వెల్లడించారు. 104 రకాల మందులు ఉచితంగా అందిస్తారని వివరిం చారు. స్థానికంగా వైద్యం అందుబాటులో లేకుంటే పెద్ద హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లి వైద్యం చేయిస్తారన్నారు. గ్రామాల్లో వలంటీ ర్లు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని, అందరి భాగ స్వామ్యంతోనే కార్యక్రమం విజయవంతమ వుతుందని వివరించారు. గ్రామంలో 16 మందికి దంత సమస్యలు, 12 మందికి గుం డె సమస్యలు, ఇద్దరికి క్యాన్సర్ ఉన్నాయని గుర్తించినట్టు చెప్పారు. వారిని ప్రభుత్వ హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయి స్తామని పేర్కొన్నారు. అనంతరం రోగులకు వైద్యులు చికిత్స అందించే విధానాన్ని జేసీ స్వయంగా పరిశీలించారు. మొత్తం 183 మంది రోగులు చికిత్స కోసం రాగా వారిం దరినీ పరీక్షించారు. అవసరమైన వారికి పరీ క్షలు నిర్వహించిన అనంతరం చికిత్స అం దించి ఉచితంగా నెలరోజులకు సరిపడా మందులు ఇచ్చారు. కార్యక్రమంలో డీఎం అండ్‌హెచ్‌ఓ ఓఎస్ విజయమ్మ, తహసీల్దార్ పి.పార్వతి, ఎంపీడీవో కె.స్వరూపరాణి, సర్పంచ్ దేవరకొండ భూలక్ష్మి, ఎంపీటీసీ అద్దూరి సోమమ్మ, డీఐటీ వెంకటేశ్వర్లు, ప్రత్యేక వైద్యులు ఎస్.శాంతి వైష్ణవి, జి.రవి ప్రకాష్, చినగంజాం వైద్యాధికారులు ఎస్ విజయభాస్కర్, పి.సాయిశ్రీ చరణ్, కె.కీర్తి సరోజ్, నోడల్ అధికారి బ్రహ్మం, 104 డీఎం జె.నాగేశ్వరరావు, ఓఈ కృపాసాగర్, డీఈఓ పి.రాఘవ, ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్, సూపర్ వైజర్, ఏఎస్‌ంలు, ఎంఎల్‌లు మురళి, మహేశ్, ఆశాలు, పంచాయతీ కార్యదర్శి ఉషా నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవల తీరును పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

క్లుప్తంగా

వీర జవాను మృతిపై మంత్రి నాగార్జున సంతాపం



భట్టిప్రోలు: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పల్లెకోనకు చెందిన జవాను పురమా గోపరాజు (26) సోమవారం రాజస్థాన్‌లోని జస్సల్‌మీర్ పాకిస్తాన్ బోర్డర్‌లో విధి నిర్వహణలో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, ప్రగాఢ సంతాపం తెలిపారు. మద్రాస్-6 యూనిట్‌లో లాన్స్ నాయక్‌గా పని చేస్తున్న పురమా గోపరాజు మరణం తీరని లోటని మంత్రి పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించి సంతాపం ప్రకటించారు. బుధవారం సైనిక లాంఛనాలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గోపరాజు మృతదేహానికి మధ్యాహ్నం అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

భౌతికశాస్త్ర మర్మాలు పుస్తకావిష్కరణ

అద్దంకి: భౌతిక శాస్త్రంలో అనేక చిక్కుముడులు విప్పే పుస్తకం భౌతిక శాస్త్ర మర్మాలు (మిస్టరీస్ ఫీనామినా ఎక్స్‌ప్లోర్డ్) అని ప్రిన్సిపాల్ వి.మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక కట్టా రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్దుల్ నయీమ్ రచించిన మిస్టరీస్ ఫీనామినా ఎక్స్‌ప్లోర్డ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మోహనరావు మాట్లాడుతూ రచయిత నయీమ్ భౌతిక శాస్త్రంలో మంచి పట్టు సాధించాడని చెప్పారు. ఈ పుస్తకంలో ప్రపంచం గురించి, అజ్ఞాత ప్రదేశాల గురించి మనం ఆలోచించేలా చేస్తుందన్నారు. అనంతరం నాయీమ్‌ను అభినందించి ఘనంగా సన్మానించారు.

మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా
- నిజాంపట్నంలో హార్ దిల్ మే వైఎస్సార్ - హమ్ సబ్ జగన్ కే సాత్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వి.ఖాదర్ బాషా, మైనార్టీ సంఘ నాయకులు

నిజాంపట్నం: మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమాన్ని నిజాంపట్నంలోని పెద్దమసీదు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. ముస్లింల సామాజిక అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి ఉన్న అడ్డంకులను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలగించారని తెలిపారు. గడిచిన నాలుగేళ్లల్లో డీబీటీ ద్వారా కొన్నివేల కోట్ల రూపాయలు మైనార్టీలకు అందించారని తెలిపారు. పేద మైనార్టీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం ద్వారా ఉన్నత విద్యకు అవకాశం కల్పించారన్నారు. పేద ముస్లిం కుటుంబాలలో వివాహాలు జరిగితే షాదీ తోఫా కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబాలకు జగనన్న పెద్దన్నగా నిలిచారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ముస్లింలకు అందించడమే కాకుండా, రాజకీయంగానూ అత్యధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మైనార్టీలు అండగా నిలవాలని కోరారు. అనంతరం ప్రభుత్వం మైనార్టీలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందించారు. బాపట్ల జిల్లా మైనార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాజర్‌ఖాన్, స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ బాజీవలి, వక్ఫ్‌బోర్డు సెక్రటరీ మస్తాన్‌వలీ, వక్ఫ్‌బోర్డు వైస్ ప్రెసిడెంట్ ఇమామ్ హుస్సేన్, ఎస్కే సిరాజ్ పాల్గొన్నారు.

ఐటీ క్విజ్ రాష్ట్రపోటీలకు 23 మంది ఎంపిక



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం గంగాధర్

బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని ఏబీఎం పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి టీసీఎస్ నేషనల్ లెవెల్ రూరల్ ఐటీ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 25 మండలాల నుంచి 61 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన 23 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన జ్యోతిరావు సాయిపతి ప్రథమ, చెరుకుపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన ఎ.పూర్ణేంద్ర మౌళీశ్వర్ ద్వితీయ స్థానాలు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గంగాధర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు పోటీలను పర్యవేక్షించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్ అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వలపర్ల విద్యార్థిని

మార్టూరు: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని వలపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పొలపర్తి నవ్య ఎంపికైంది. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పుగంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో పొలపర్తి నవ్య విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ రవి దేవరాజ్ మంగళవారం తెలిపారు. పోటీలకు ఎంపికైన నవ్యను పాఠశాల హెచ్‌ఎం నిర్మల, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ

రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ



వెల్లటూరులో ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళుల ర్పిస్తున్న ఓలేటి శివాజీ, బీసీ సంఘాల నాయకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) ధైర్య సాహసాలు అనిర్వచనీయమని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ బహుజన ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీక అని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్య సాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల అధ్యక్షుడు మురాల వాసుదేవ్, నాయకులు చందోలు రవికుమార్, రాజేష్, బేతపూడి సాంబశివరావు, గోపి, వీరరాఘవులు, పసి, సుబ్బారావు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐలమ్మ సేవలు అజరామరం
–ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు

రేపల్లె రూరల్: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చాకలి ఐలమ్మ సేవలు అజరామరమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా పట్టణంలోని శారద ఐటీఐ కళాశాల ఆవరణంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన ధీరురాలన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశానికి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకుడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారకా శ్రీను, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, బాపట్ల జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర్లు, కొప్పనాతి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దా.మా.షా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి..



చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శంకరరావు

నిజాంపట్నం: మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. నిజాంపట్నంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ వల్ల నిర్దిష్టమైన లక్ష్యసాధన జరగాలంటే ఓబీసీ, మైనార్టీ, ఎస్సీ మహిళలకు దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పిస్తూ, సవరణ జరగాలని అప్పుడే మహిళా రిజర్వేషన్‌కు న్యాయం జరుగుతుందన్నారు.

రజక జనసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని 5వ వార్డులో నైట్‌షెల్టర్‌లో రజక జన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘనాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేపల్లె తాలూకా రజక జన సంక్షేమ సేవా సంఘ కన్వీనర్ కొండపల్లి శివనాగేశ్వరరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మెరైన్ సిబ్బందికి ఎస్పీ అభినందనలు



మెరైన్ ఎస్ఐ సుబ్బారావుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

చీరాల టౌన్: సముద్రంలో అలల తాకిడికి గురై కొట్టుకుపోతున్న నలుగురు పర్యాటకుల ప్రాణాలను కాపాడిన మెరైన్ ఎస్ఐ పసుపులేటి సుబ్బారావు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. మంగళవారం బాపట్లలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడు రోజులు క్రితం చీరాల వాడరేవులో వినాయక నిమజ్జనానికి చిలకలూరిపేటకు చెందిన 50 మంది భక్తుల బృందం వచ్చారు. ఈక్రమంలో నలుగురు మహిళలు అలల తాకిడికి గురై సముద్రంలో కొట్టుకుపోతుండగా బీచ్ ఒడ్డున విధులు నిర్వహిస్తున్న మెరైన్ ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది కలిసి వారిని కాపాడారు. ఈసందర్భంగా ఎస్పీ వారిని మెమొంటో, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండటం వలనే నలుగురు ప్రాణాలను కాపాడారన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉన్న ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది సేవలను ప్రశంసించారు. అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని, విధి నిర్వహణలో ఎప్పుడు అప్రమత్తంగా ఉండి మరింతగా సేవలందించాలని ఎస్పీ సూచించారు. ఏఎస్పీ మహేష్, మెరైన్ సీఐ శ్రీనివాసరావు సిబ్బంది ఉన్నారు.

మినీ లారీని ఢీకొట్టిన ఆటో



ఘటనాస్థలంలో గాయపడిన మహిళలు



క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలు

వేటపాలెం: రోడ్డు పక్కన ఆగి ఉన్న మినీ లారీని వెనుక నుంచి వేగంగా ఆటో ఢీకొట్టడంతో ఐదుగురు మహిళలు తీవ్రంగా గాయపడిన ఘటన వేటపాలెం మండల పరిధిలోని 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగింది. ఎస్ఐ జి.సురేష్ వివరాల మేరకు.. బాపట్ల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పదిమంది మహిళలు కనపర్తి వెళ్లడానికి ఆటోలో బయలు దేరారు. అయితే వేటపాలెం బైపాస్ వద్దకు వచ్చిన తరువాత రోడ్డు పక్కన ఆగి ఉన్న మినీ లారీని వేగంగా వచ్చిన ఆటో అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డు పక్కన మినీ లారీ పక్కకు పడిపోగా ఆటో పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది మహిళల్లో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సు సహాయంతో గాయపడినవారిని చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

వీఆర్‌ఓ మోసగించాడని యువకుడు ఆత్మహత్యాయత్నం

చీరాల: వీఆర్‌ఓ తనను మోసగించాడంటూ మనస్తాపం చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన మంగళవారం చీరాలలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. చీరాల హరిప్రసాద్‌నగర్‌కు చెందిన మానుపాటి సాయితేజ వద్ద చిన్నగంజాం వీఆర్‌ఓగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం పది ఎకరాల భూమి తన పేరుపై రాయించి ఇస్తానని ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.11 లక్షలు, వడ్డీ పేరుతో అదనంగా రూ.22 లక్షలు వసూలు చేశాడని బాధితుడు తెలిపారు. డబ్బులు తీసుకున్న వీఆర్‌ఓ సుబ్రహ్మణ్యం నెలలు గడుస్తున్నా తమకు స్థలం చూపించకపోవడంతో వీఆర్‌ఓను నిలదీయగా, తమపై తప్పుడు కేసులు పెట్టించారని బాధితుడు వాపోయాడు. పెద్ద నాయకుల అండతోనే వీఆర్‌ఓ అలా చేస్తున్నాడని, డబ్బులు అడిగిన ప్రతిసారి బెదిరింపులకు గురిచేస్తున్నాడని తెలిపారు. సోమవారం రాత్రి వీఆర్‌ఓ ఫోన్‌లో అవమానకరమైన మాటలు మాట్లాడడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

వేర్వేరు కారణాలతో మహిళల ఆత్మహత్యాయత్నం

మార్టూరు: క్షణికావేశంలో ఇద్దరు వివాహిత మహిళలు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఈఘటన మండలంలోని బొల్లాపల్లి, ద్రోణాదుల గ్రామాల్లో మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. ద్రోణాదుల ఎస్టీ కాలనీకి చెందిన దేవరకొండ మధుమతి భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివసిస్తోంది. ఈ క్రమంలో తల్లి మందలించిందనే కారణంతో మధుమతి ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయటంతో గమనించిన స్థానికులు ఆమెను మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిద్రమాత్రలు మింగి..

కుటుంబంలో జరిగిన కొద్దిపాటి వివాదంలో మనస్థాపానికి గురైన బొల్లాపల్లికి చెందిన మురికిపూడి గంగమ్మ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేసింది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అండర్ -19 ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో భవానీ దేవి, కోటేశ్వరమ్మ, తదితరులు

బాపట్ల అర్బన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ -19 విభాగంలో రైఫిల్ షూటింగ్, చెస్, రోప్ స్కిప్పింగ్, బాల బాలికల ఎంపికలు మంగళవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జరిగాయి. ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భవానీదేవి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా యు.ఉదయ భాస్కర్, ఎస్.సుధాకర్ రెడ్డి, పి.శాంతకుమారి, ఎం.గోపి, ఏఎంజీ రాజు, గురునాథ్, శ్రీహరి, ఎంఎస్‌కే మెహబూబి, ఎస్.కె. నాగుల్ మీరాబీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ గుంటూరు జిల్లా తరఫున పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

చెస్ (బాలికల విభాగం): ఎం.జ్యోత్స్న (వి.పి.సౌత్), వి.మౌనిక (ఏఎంజి), పి.మేఘన (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాపట్ల), కె.మేరీ గ్రేస్ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ అమరావతి), ఎం.పునీత, (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఆర్.కె.పి)

బాలుర విభాగం: బి.శివగోపికృష్ణ (ఏపీ మోడల్, వినుకొండ), ఎస్.బన్నీ రూపెస్, (విశ్వసాయి, వినుకొండ), ఎ.సూర్య తేజ (ఏఎంజీ, సిహెచ్ పేట), ఈహెచ్‌ఆర్ ఫణీంద్ర, (ఎస్.వి.ఆర్.ఎం, నగరం), వి.లోకేష్ నాయక్ (ఏఎంజీ, సిహెచ్ పేట)

రోప్ స్కిప్పింగ్ (బాలికల విభాగం): కె.బ్యూలా (వి.పి.సౌత్), ఎస్.కె. షాజహాన్ (వేగ దేవి ఎన్నార్టీ), డి.మీరాబీ, (ఏఎంజీ సిహెచ్ పేట), కె.అనూష (ఏపీఎస్ బాపట్ల), ఎం.హారిక (ఏఎంజీ సిహెచ్ పేట), బాలుర విభాగం : పి. ముఖేష్, యు. హరికృష్ణ, బాల వెంకట గోపీనాథ్, నజీర్, మనోజ్ కుమార్

హర్ ఘర్ జల్ గ్రామంగా పాతనందాయపాలెం



సర్పంచ్ కావూరి చిట్టెమ్మకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జల్‌జీవన్ మిషన్ పీడీ పి.కిరణ్‌కుమార్

కర్లపాలెం: ప్రతి ఇంటికీ నీటి సరఫరా చేసేందుకు కొళాయిలు ఏర్పాటు చేయటంతో హర్ ఘర్ జల్ గ్రామంగా పాతనందాయపాలెం గ్రామానికి గుర్తింపు లభించిందని జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్ డైరక్టర్ పి.కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని కళ్యాణ మండపంలో జల్ జీవన్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రాజెక్ట్ డైరక్టర్ పి.కిరణ్‌కుమార్ గ్రామ సర్పంచి కావూరి చిట్టెమ్మకు హర్ ఘర్ జల్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రతి రోజూ కుటుంబానికి ఉచితంగా 55లీటర్ల తాగునీటిని అందజేస్తామని తెలిపారు. సర్పంచ్ కావూరి చిట్టెమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేయటం ద్వారా ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయటం అభినందనీయమన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వసుధ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ నిధులు రూ.21.50లక్షలతో గ్రామంలోని 316 గృహాలకు కొళాయిలు ఏర్పాటు చేశామని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ వి.లక్ష్మణ్, అధికారులు పి.తేజ్ సంజిత్, కృపాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి, మురళి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందితేనే సార్థకత

డీబీఆర్‌సీ ప్రోగ్రాం మేనేజర్ రమణమూర్తి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, డీబీఆర్‌సీ ప్రతినిధులు

చీరాల టౌన్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందరూ పొందాలి.. సంచార జాతుల ప్రజలు చదువుకుని తమకు ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక డోలా ఐజాక్ ఎన్జీఓ భవనంలో సంచార జాతుల ప్రజలకు అధికారులతో కలిసి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రోగ్రాం మేనేజర్ మాట్లాడుతూ ఊరూరా తిరుగుతూ వివిధ రకాల వస్తువులు అమ్మకాలు చేస్తూ జీవనం సాగించే సంచార జాతుల ప్రజలకు సక్రమంగా పథకాలు అందలేకపోతున్నాయన్నారు. సంచార జాతులకు పూర్తిస్థాయిలో పథకాలు అందిస్తేనే పథకాలకు సార్థకత లభిస్తుందన్నారు. సమాజంలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుండాలంటే వివక్షతలు లేకుండా ఉండాలన్నారు. సంచార జాతుల ప్రజలు తమ వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ కె.నేతాజీ మాట్లాడుతూ చీరాల మండలంలోని గ్రామాల్లో నివాసం ఉంటున్న సంచార జాతుల ప్రజలు అందరికీ సంక్షేమ పథకాలు అందేలా తన వంతుగా కృషి చేస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ కార్యాలయం మేనేజర్ శ్యామలాదేవి, సబ్‌యూనిట్ హెల్త్ ఆఫీసర్ శేషుబాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రామకృష్ణ, రీజనల్ కో-ఆర్డినేటర్ కోటేశ్వరరావు, షాడోస్ ప్రతినిధి రాజాసాల్మన్, సచివాలయాల అధికారులు, సంచార జాతుల ప్రజలు పాల్గొన్నారు.